క్లుప్తంగా

అనారోగ్యంతో మైనార్టీ నాయకుడు మృతి



మార్టూరు: మండల వైఎస్సార్ సీపీ నాయకుడు వలపర్లకు చెందిన షేక్ జాఫర్ అలీ (50) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. పార్టీ ఆవిర్భావం నుంచి వలపర్ల గ్రామంలో పార్టీ అభివృద్ధికి జాఫర్ అలీ కృషిచేయడమే కాక స్థానికులతో కలిసి హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థను స్థాపించి చెవిటి వారికి వినికిడి మిషన్లు పెన్షన్ల మంజూరులో కీలక పాత్ర పోషించారు. గత కొంతకాలంగా క్యాన్సర్‌తో గుంటూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జాఫర్ అలి పరిస్థితి విషమించి గురువారం సాయంత్రం మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నేటి మధ్యాహ్నం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పార్టీ నాయకుడు కాళహస్తి కృష్ణమూర్తి తెలిపారు. అలీ మృతిపై వైఎస్సార్ సీపీ నాయకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, రావి రామనాథంబాబు, మండల పార్టీ కన్వీనర్ పఠాన్ కాలేషావలి, గడ్డం మస్తాన్‌వలి, నాయకులు తమ సంతాపం తెలిపారు.

జాతీయ వార్షిక బడ్జెట్‌పై చర్చ

చీరాల: చీరాల ఇంజినీరింగ్ కాలేజీలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ వార్షిక బడ్జెట్‌పై విద్యార్థులతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ జగదీష్ అధ్యక్షత వహించారు. బడ్జెట్ కేటాయింపుల్లో రక్షణ, రోడ్డు, రైల్వే, ఆహారం, రూరల్ డెవలప్‌మెంట్, ఎడ్యుకేషన్ ఇతర మౌలిక రంగాలలో కేటాయింపులపై విద్యార్థులతో చర్చించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ లెఫ్టినెంట్ హరీష్, కళాశాల సెక్రటరీ కొల్లి రవికుమార్, డీన్ ఎకనామిక్స్ ఎం.పవన్, రెండు, మూడో సంవత్సరం బీటెక్, డిప్లమో విద్యార్థులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

వేటపాలెం: స్థానిక జెడ్పీ హైస్కూల్ దగ్గరలో నివాసం ఉంటున్న అవివాహిత యువతి అదృశ్యమైనట్లు ఆమె సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీ సురేష్ గురువారం తెలిపారు. తన సోదరి ఏడాదిగా చీరాలలోని మొబైల్ షాపులో పని చేస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే జూలై 30వ తేదీన ఉదయం షాపుకని చెప్పి వెళ్లిన తన సోదరి తిరిగి ఇంటికి రాలేదని పేర్కొంది. సోదరి అదృశ్యంపై షాపు యజమానిపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోగుల సేవల్లో అలసత్వం తగదు

వేటపాలెం: రోగులకు సేవలందించడంలో సిబ్బంది అలసత్వం వహించరాదని స్థానిక పీహెచ్‌సీ నూతన వైద్యాధికారి వై స్వాతి కిరణ్ పేర్కొన్నారు. గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈయన చీరాల ఏరియా వైద్యశాల నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. రెండో డాక్టర్‌గా చీరాల ఏరియా వైద్యశాల్లో విదులు నిర్వహిస్తున్న సాయివైష్ణవి బదిలీపై ఇక్కడికి వచ్చారు. చీరాల ఏరియా వైద్యశాల్లో స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తున్న కే నాగ మణిని వేటపాలెం పీహెచ్‌సీకి బదిలీ చేశారు. అయితే ఈమె ఇంకా విధుల్లో చేరలేదు. ఈసందర్భంగా ఆయన పీహెచ్‌సీలో సిబ్బందితో సమావేశం నిర్వహి ంచి మాట్లాడారు. సిబ్బంది, ఆశవర్కర్స్, ఏఎన్ఎంలో ప్రతి ఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాలని ఆదేశించారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం

అద్దంకి రూరల్: పట్టణంలోని కాకానిపాలేనికి చెందిన బెజవాడ సుబ్బులు (90) గురువారం ఉదయం మృతి చెందింది. రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్ష, కార్యదర్శులు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు ప్రోత్సాహంతో వారి కుమారులు సుబ్బారావు, రామారావు, శ్రీనివాసరావులు నేత్రదానానికి అంగీకరించారు. పెదకాకాని శంకర కంటి ఆసుపత్రికి చెందిన డాక్టర్ చేతన్ బృందం వచ్చి మృతురాలి మృతురాలి కార్నియాలను సేకరించారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఇది 210వ నేత్రదానం. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో ఎన్నికల సందడి

- పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
- 8న ఎన్నికలు, అదే రోజు చైర్మన్, వైస్ చైర్మన్‌ల ప్రమాణ స్వీకారం

చీరాల అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటి ఎన్నికలకు ఏపీ సమగ్ర శిక్ష అధికారులు గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రతి ప్రభుత్వ అనుబంధ పాఠశాలలో ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. 2009 విద్యా హక్కు చట్టం ప్రకారం ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు పిల్లలకు ఉచిత నిర్బంధ హక్కులోని సెక్షన్ 21 ప్రకారం విద్యాక మిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి ఉంది. గత ప్రభుత్వం స్కూల్స్‌లో ఏర్పాటు చేసిన పేరెంట్స్ కమిటీల పదవీకాలం ఈ ఏడాది జూలైతో ముగియడంతో కొత్తగా పేరెంట్స్ కమిటీల స్థానంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలుగా పేరు మార్చి ఈనెలలో ఎస్ఎంసీలు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర సమగ్ర శిక్ష చర్యలు తీసుకుంది.

చీరాల మండలంలో 85 పాఠశాలలు..

చీరాల మండలంలో మొత్తం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 85 ఉన్నాయి. వీటిలో ఎస్ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. పాఠశాల యూనిట్‌గా ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఆయా పాఠశాలల్లో ఒక్కో తరగతి నుంచి ముగ్గురు తల్లిదండ్రులను సభ్యులుగా ఎన్నుకుంటారు. ప్రాథమిక పాఠశాలల్లో 15 మంది, ప్రాథమికోన్నత పాఠశాలలో 21 మంది, హైస్కూళ్లలో 24 మంది సభ్యులను ఎన్నుకుంటారు. ఇందులో ఆరుగురు ఎక్స్‌అఫిషియో, ఇద్దరు కో-ఆప్షన్ సభ్యులు ఉంటారు. ఈఎన్నికలను పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఈనెల 5న ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించడం, పరిష్కరించడం, అదే రోజు సాయంత్రం 3-4 గంటల మధ్య తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. 8న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలను నిర్వహిస్తారు. కనీసం 50 శాతం పేరెంట్స్ హాజరుకావాలి. ఎన్నికల ప్రక్రియ చేతులు ఎత్తడం, వాయిస్ ఓటు ద్వారా జరుపుతారు. అసాధారణ పరిస్థితుల్లోనే రహస్య బ్యాలెట్ నిర్వహిస్తారు. విద్యార్థి తల్లి, తండ్రి, సంరక్షకుడిలో ఒకరు మాత్రమే ఎన్నికల్లో పాల్గొనేందుకు అర్హులు. తల్లిదండ్రులకు వేర్వేరు తరగతుల్లో పిల్లలుంటే ఆయా తరగతుల ఎన్నికల్లో పాల్గొనవచ్చు. 2 గంటల నుంచి కమిటీ సభ్యులు, చైర్మన్, వైస్‌చైర్మన్‌లతో ప్రమాణ స్వీకారం, నూతన కమిటితో తొలి సమావేశం నిర్వహించేలా ఎస్ఎంసీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఎన్నుకున్న సభ్యుడి పదవీకాలం రెండేళ్లు.



పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్‌ను నోటీసు జాబితాలో ప్రచురిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్ఎంసీ కమిటీ బాధ్యతలు...

రెండు నెలలకు ఒకసారి కమిటీ సమావేశం ఏర్పాటు కావాలి. ఎవరైనా సభ్యుడు ప్రత్యేక అజెండాతో సమావేశం ఏర్పాటు చేయమని కోరితే చైర్‌పర్సన్‌ను సంప్రదించి హెచ్ఎం ఏర్పాటు చేస్తారు. మధ్యాహ్న భోజన కమిటీ, విద్యాసంబంధ విషయాల సమీక్ష కమిటీ, నిధుల వినియోగ కమిటీ, సోషల్ ఆడిట్ వంటి అనుబంధ కమిటీలను ఎస్ఎంసీలు ఏర్పాటు చేస్తారు. విద్యార్థులు నేర్చుకున్న అంశాలను పరిశీలించారు. విద్యార్థులు, టీచర్ల హాజరును పరిశీలించాలి. గ్రామంలో బడి వయస్సు బాలబాలికలను పాఠశాలలో చేర్పించాలి. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు, బడిమానేసిన పిల్లలను గుర్తించి బడుల్లో చేర్పించాలి. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలి. పాఠశాల జమా ఖర్చుల జాబితా తయారు చేసుకోవాలి.

ఇసుక దందా షురూ..!

- పందిళ్లపల్లి పంచాయతీ పరిధిలోని రాత్రి వేళ్లలో ఇసుక అక్రమ తరలింపు
- టీడీపీ, జనసేన నాయకులే సూత్రధారులు

వేటపాలెం: కూటమి నాయకులు ఎప్పుడెప్పుడా అని కాచుకుకూర్చొని మరీ అక్రమాలకు తెర లేపారు. అదను చూసి దొరికింది కదా అని ఇసుకను మొత్తగా బొక్కేస్తున్నారు తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు. బాపట్ల జిల్లా వేటపాలెం మండల పందిళ్లపల్లి గ్రామం శివారుల్లో అసైడ్ భూములను ఆక్రమించి అక్రమార్కులు రాత్రి వేళల్లో ఇసుక రవాణా దందా నిర్వహిస్తున్నారు. ఇసుకను పొక్లెయినర్లతో తవ్వి రాశులుగా పోసి అమ్మేస్తున్నారు. దీంతో ఆప్రాంతం అంతా గుంతగా మారడంతో చెరువులను తలపిస్తున్నాయి. అధికారం చేతికి రావడంతో టీడీపీ, జనసేన నాయకులు దొరికిందే చాన్స్ అన్నట్లుగా ఇసుక వ్యాపారం అక్రమ పద్ధతిన చేస్తున్నారు. చాలా కాలంగా పరిస్థితి జరుగుతున్నా సెబ్ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. కేసులు నమోదు చేయడం లేదు. కొందరు సెబ్ అధికారులు ఇసుకాసురులు వద్ద మామూళ్లు తీసుకుంటూ మౌనం దాలుస్తున్నారు. సివిల్ పోలీసులు అయితే మనం ఉండేది కొద్దిరోజులే కదా, మనకెందుకులే వివాదాలు అంటూ పట్టించుకున్న పాపనా పోలేదు.



పందిళ్లపల్లి రైల్వే ట్రాక్ పక్కన ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక

రెచ్చిపోతున్న ఇసుకాసురులు..

ప్రభుత్వం మాది అధికారం మాది అన్నట్లుగా ఇసుకను అక్రమంగా తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ప్రభుత్వ భూముల నుంచి ట్రక్కుల్లో ఇసుకను నింపేస్తూ జిల్లాలు దాటిస్తున్నారు. సంబంధిత అధికారులు కూడా చూసీ చూడనట్లుగా వ్యవహరించడంతో ఇసుక అక్రమరవాణా కొనసాగుతోంది. అలానే రాత్రి వేళల్లో ముఖ్యంగా పందిళ్లపల్లి శివారు ప్రాంతాల నుంచి ట్రాక్టర్ల సహాయంతో వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. పోలీసులు కేసులు నమోదు చేసినా అధికార పార్టీ నాయకుల పలుకుబడితో ఆ కేసులు నిలవడం లేదు.

అంజిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

జే.పంగులూరు: వైఎస్సార్ సీపీ నాయకుడు భీమనాథం అంజిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొండమూరు గ్రామానికి చెందిన భీమనాథం అంజిరెడ్డి గత 10 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సుబ్బారెడ్డి గురువారం భీమనాథం అంజిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంజిరెడ్డి భార్య సీతాదేవి, కుమారుడు సుబ్బారెడ్డి, కూతురు పద్మతో ఆయన మాట్లాడారు. అంజిరెడ్డి మృతి మండలంలో పార్టీకి తీరని లోటు అన్నారు. వారి కుటుంబానికి ఎప్పుడు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం అక్కడకి వచ్చిన కార్యకర్తలతో కొంచెం సేపు మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుదన్నారు. ఆయనతో పాటు మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆనందరావు తదితరులు ఉన్నారు.



అంజిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాజ్యసభ సభ్యుడు సుబ్బారెడ్డి

పోరాటాల ఫలితమే సుప్రీం తీర్పు



చీరాలలో బాణసంచా కాలుస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



అద్దంకి బంగ్లారోడ్‌లో సంబరాలు చేసుకుంటున్న నాయకులు

- సంబరాలు జరుపుకున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చీరాల: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు గురువారం అనుకూలమైన తీర్పు ఇవ్వడంతో చీరాలలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం ఎస్సీ వర్గీకరణ జరగాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సుదీర్ఘ న్యాయపోరటం చేసిందన్నారు. అనేక న్యాయస్థానాల్లో న్యాయ పోరాటం చేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం తీర్పు ఇవ్వడం ఎస్సీలలో ఉన్న 59 కులాలు ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరణ చేయడం తమకు చారిత్రాత్మక విజయంగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎమ్మెస్సీ అధ్యక్షుడు బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుడ్డు వందనం మాదిగ, తేళ్ల దేవానందం, దుడ్డు ఏసుపాదం, తేళ్ల లక్ష్మీశేఖర్, వంశీ, పిడతల అభిషేక్, లక్ష్మయ్య, రాజా, సుబ్బారావు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీవర్గీకరణ తీర్పుపై హర్షం..

అద్దంకి రూరల్/బల్లికురవ/మేదరమెట్ల: ఎస్సీ వర్గీకరణపై గురువారం సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడంపై ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా స్థానిక బంగ్లారోడ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి బాణా సంచా కాల్చారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు అనపర్తి రమేష్, గంగవరపు సిద్ధు, ఆర్టీసీ కోటయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు పూనూరి నరేంద్ర, చక్రవర్తి, బుల్లయ్య పాల్గొన్నారు.

– బల్లికురవ సర్పంచ్ పందిరి అంజిబాబు ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల శాఖ బాధ్యులు కే. ఇజ్రాయేల్, కందుకూరి పేతురు, జంధ్రాజుపల్లి రమేష్, తంగిరాల అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.



బల్లికురవలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

– ఎస్సీ రిజర్వేషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సహజన్యాయ సూత్రాలను బతికించిందని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయుడు తేళ్ల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో అన్నారు.

ముర్రుపాలతో వ్యాధినిరోధక శక్తి



ఎస్ఎల్ గుడిపాడులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

చీరాల టౌన్: పుట్టిన బిడ్డకు ముర్రుపాలు ఇవ్వడం వల్ల బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యంతో పాటుగా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ ఏసీడీపీవో సుచరిత్ర, సూపర్‌వైజర్ బి.కుముద్వతీలు సూచించారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీడీపీవో మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలను రూపొందించారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లులు, గర్భిణితో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బల్లికురవ: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, బిడ్డ పుట్టిన వెంటనే పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వీ. సలోమి, ఏ. విజయనిర్మల అన్నారు. గురువారం మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు, రామాంజనేయపురం గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, అంకమ్మ, మహాలక్ష్మీ, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

వేటపాలెం

వేటపాలెం: స్థానిక రామన్నపేటలో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సావాల సందర్భంగా సూపర్‌వైజర్ సజ్జా పుష్పవల్లి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యకర్తలు నాగూర్‌బీ, అలివేలు, రజని, కృష్ణవేణి, తల్లులు పాల్గొన్నారు.



చీరాలలో కరపత్రాలు, పోస్టర్లతో ఐసీడీఎస్ సిబ్బంది, గర్భిణులు

కల్తీ ఎరువులు విక్రయిస్తే లైసెన్స్ రద్దు

కారంచేడు: రైతులకు నష్టం కలిగించేలా కల్తీ ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తే దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేస్తామని పర్చూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్ మోహన్‌రావు హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని కుంకలమర్రు గ్రామంలో ఎరువులు దుకాణాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా షాపుల్లోని స్టాక్, కంపెనీలు, వాటికి ఉండే అర్హతలు, లైసెన్స్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలన్నారు. డిమాండ్‌ను బట్టి అధిక ధరలకు విక్రయించినా, స్టాక్‌ను బ్లాక్ చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసే అన్నదాతలు కూడా కొనుగోలు సమయంలో కచ్చితంగా బిల్లులు తీసుకోవాలన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా పాపారావు

చీరాల: చీరాల తాలూకా తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా మారుబోయిన పాపారావు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ఎన్నికలు జరగాల్సి ఉండగా యూనియన్ సభ్యులందరూ ఏకతాటిపై వచ్చి ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకంతో యూనియన్ అభివృద్ధికి పాటుపడతానని అన్నారు. కార్యక్రమంలో బుడంగుంట్ల సుబ్బారావు, ఎం.జాలిరెడ్డి, మిరియాల రామారావు, తులం నాగేశ్వర రావు, ఎస్.కొండయ్య పాల్గొన్నారు.

న్యాయ పుస్తకాలు సద్వినియోగం చేసుకోవాలి

చీరాల రూరల్: నూతన న్యాయ పుస్తకాలను న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గౌరవ రమేష్‌బాబు, కొటిక ఉదయ భాస్కరరావులు పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన న్యాయ పుస్తకాలను గురువారం లైబ్రరీకి అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో జూలై ఒకటి నుంచి కొత్త న్యాయ చట్టాలు అమలులోకి వచ్చాయని, గతంలో ఉన్న భారతీయ శిక్షా స్మృతి స్థానంలో కొత్తగా వచ్చిన న్యాయ చట్టాలను న్యాయవాదులు అవపోసన పట్టాలని సూచించారు. అయితే కొత్త చట్టాలకు సంబంధించిన పుస్తకాలు రూ. 5,800 కొనుగోలు చేసి న్యాయవాదుల సౌకర్యార్థం లైబ్రరీలో అందుబాటులో ఉంచనున్న చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బోయిన శ్రీనివాసరావు, ట్రెజరర్ నాశన రామకోటేశ్వరరావు, సిరిపురపు కామేశ్వర రావు, మహిళా ప్రతినిధి జీకే ఈశ్వరిరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో పచ్చదోమ నివారణ

బల్లికురవ: సస్యరక్షణ చర్యలతో పచ్చదోమను నివారించవచ్చని వ్యవసాయాధికారిణి ఎస్వీపి కుమారి రైతులకు సూచించారు. గురువారం మండలంలోని కె. రాజుపాలెం గ్రామంలో సాగుచేసిన పత్తి పైరును ఆమె పరిశీలించారు. పచ్చదోమ నివారణకు మోనోక్రోటోఫాస్ 105 ఎంఎల్ లీటరు నీటికి లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు మొక్కతడిసేలా పిచికారీ చేయాలన్నారు. సంప్రదాయ డీఏపీకి బదులు నానో డీఏపీ, ఎకరాకు అర కేజి చొప్పున పిచికారీ చేయాలన్నారు. పరిశీలనలో ఎంపీఈవో గుణశేఖర్ పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల: నియోజకవర్గంలో చీరాల, వేటపాలెం మండలాల్లో పర్యటించి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు గురువారం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పింఛన్లు పంపిణీ చేశారు. పట్టణంలో 18, 19వ వార్డుల్లో ఆయన వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేయగా రూరల్ మండలంలో తోటవారిపాలెం, బుర్లవారిపాలెం, వేటపాలెం మండలం కొత్తపేట, సింధూర్ కాలనీలో ఆయన పలువురికి పెన్షన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా కింద అర్హులైన ప్రతి ఒక్కరికి పలురకాల పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి, టీడీపీ నాయకులు నాతాని ఉమామహేశ్వరరావు, సజ్జా హేమలత, కౌన్సిలర్ మించాల సాంబశివరావు, గొడుగుల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించకపోతే ప్రాణనష్టం



పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్న ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్

చీరాల: స్నానాలు ఆచరించేందుకు సముద్రానికి వచ్చే పర్యాటకలు పోలీసులు, ప్రభుత్వం విధించిన నిబంధనలు పాటించకపోతే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని పర్యాటకులకు గురువారం ఎస్ఐ శివకుమార్ తెలిపారు. వాడరేవు, రామాపురంలో పర్యటించిన ఆయన తీరానికి వచ్చిన పర్యాటకులకు అవగాహన కల్పించారు. ఆగస్టులో తీరంలో అలల తాకిడి అధికంగా ఉంటుందన్నారు. పోలీసులు ఏర్పాటు చేసిన ఎర్ర జెండాల పరిధిలోనే స్నానాలు అచరించాలన్నారు. ప్రమాదాలు నివారించేందుకు లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశామన్నారు. మెరైన్ పోలీసులు నిత్యం గస్తి ఉండేలా ఏర్పాటు చేశామని తెలిపారు.